రాజేంద్రప్రసాద్‌ని పరామర్శించిన కేటీఆర్

సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శించారు. ఇటీవల రాజేంద్రప్రసాద్ కుమార్తె గద్దె గాయత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం ఆమె పెద్ద కర్మ సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీలోని రాజేంద్రప్రసాద్ నివాసానికి విచ్చేసిన కేటీఆర్.. గాయత్రి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌ను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద, కాలేరు వెంకటేశ్‌లు ఉన్నారు.



సూర్య యాక్షన్ అడ్వెంచర్

తమిళ అగ్ర కథానాయకుడు సూర్య 45వ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. భారీ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా తెరకెక్కనున్న ఈ సినిమాకు ఆర్.జె.బాలాజీ దర్శకుడు. ప్రతిష్టాత్మక డ్రీమ్ వారియర్స్ పతాకంపై ఎస్ఆర్.ప్రకాశ్‌బాబు, ఎస్ ఆర్.ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు బాలాజీ ఈ సినిమా స్క్రిప్ట్‌కే ఏడాది సమయం కేటాయించారనీ, సరైన లోకేషన్స్ కోసం ఎంతో శ్రమించామని నిర్మాతలు తెలిపారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా చిత్రంలో ప్రముఖ నటీనటులు, ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పనిచేయనున్నారని, ఈ ఏడాది నవంబర్లో సెట్స్‌పైకి వెళ్లే ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేస్తామని వారు చెప్పారు.

నాగబంధాల రక్షణలో

ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో కిశోర్ అన్నపురెడ్డితో కలిసి నిర్మిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. 'పెదకాపు'ఫేం విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన అగ్ర కథానాయకుడు చిరంజీవి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇవ్వగా, తలసాని శ్రీనివాసయాదవ్ కెమెరా స్విచాన్ చేశారు. అజయ్ భూపతి తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఎషియన్ సునీల్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. సినిమా బాగా రావాలని, మంచి విజయాన్ని సాధించాలని అతిథులందరూ ఆకాంక్షించారు. దేశంలోని 108 విష్ణు దేవాలయాల్లో గుప్త నిధులు నాగబంధాల ద్వారా రక్షించబడుతున్నాయని, ఈ సినిమా కథ ఈ నేపథ్యంలోనే సాగుతుందని, డివైన్, అడ్వెంచర్ ఎలిమెంట్స్‌తో కూడిన అద్భుతమైన స్క్రిప్ట్ ఇదని అభిషేక్ నామా తెలిపారు. ఇంకా యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీశర్మ, బి.ఎస్.అవినాష్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: కల్యాణ్ చక్రవర్తి, కెమెరా: సౌందర్ రాజన్, సంగీతం: అభే, సహ నిర్మాత: తారక్ సినిమాస్, సమర్పణ: లక్ష్మీ ఐరా, దేవాన్స్ నామా, నిర్మాణం: ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్, కథ, కథనం, దర్శకత్వం: అభిషేక్ నామా.

శ్రీలీల పాత్రలో మమితా?

తమిళ అగ్ర హీరో విజయ్ తన చివరి చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఓ ఆసక్తికరమైన వార్త వినిపిస్తున్నది. బాలకృష్ణ 'భగవంత్ కేసరి' రీమేక్‌గా ఈ సినిమా రూపొందనున్నదని చెన్నై సమాచారం. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మమితా బైజు ప్రధాన భూమిక పోషిస్తున్నది. తెలుగులో శ్రీలీల చేసిన పాత్రనే తమిళంలో మమితా బైజు పోషిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వినిపిస్తున్న వార్తలు కూడా దానికి బలాన్నిస్తున్నాయి. బాలయ్య సినిమాలో శ్రీలీల తన నటనతో ఆకట్టుకున్నది. యాక్షన్ సీన్స్‌లోనూ అదరగొట్టేసింది. మరి మమితా ఆ స్థాయిలో ఆకట్టుకుంటుందా? అనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మరి విజయ్, పూజా, మమితా కాంబో ఆడియన్స్‌కి ఎలాంటి ట్రీట్ అందిస్తుందో చూడాలి.

ప్రభాస్ బర్త్‌డే కానుక

ప్రభాస్ హీరోగా తెరంగేట్రం చేసిన చిత్రం 'ఈశ్వర్'. 22ఏండ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం మాస్ హీరోగా ప్రభాస్‌కి గొప్ప ప్రారంభాన్ని ఇచ్చింది. జయంత్ సి.పరాంజీ ప్రభాస్‌లోని మాస్ యాంగిల్‌ని తొలి సినిమాతోనే అద్భుతంగా ఆవిష్కరించారు. కె.అశోక్‌కుమార్ నిర్మాత. ఈ నెల 23న ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా 'ఈశ్వర్' చిత్రం గ్రాండ్‌గా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ ట్రైలర్‌ని కొత్తగా కట్ చేసి రిలీజ్ చేశారు. 'రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్' అంటూ వదిలిన 'ఈశ్వర్' ట్రైలర్ ఇప్పుడు అందర్నీ ఆకట్టుకుంటున్నదని చిత్రాన్ని విడుదల చేస్తున్న లక్ష్మీ నరసింహా మూవీస్ వారు ఆనందం వెలిబుచ్చారు. ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా అభిమానులకు మేం ఇస్తున్న కానుక 'ఈశ్వర్' రీరిలీజ్ అని వారు అన్నారు.

నా నిరీక్షణ మొదలైంది

అమర్‌దీప్, లిషి గణేశ్ కల్లపు జంటగా, సాయి వర్మ దాట్ల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'నా నిరీక్షణ'. ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. అగ్ర నిర్మాత డి.సురేశ్‌బాబు ఆశీస్సులతో ఈ సినిమా పూజాకార్యక్రమాలు జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర నిర్మాత దిల్ రాజు క్లాప్ కొట్టగా, నిర్మాత గణపతిరెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. నటుడు రాజా రవీంద్ర స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. ఈ సందర్భంగా అతిథులంతా చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. దర్శక, నిర్మాతలు ఏడు నెలలు సినిమా స్క్రిప్ట్‌మీద పనిచేశారని, తనను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్సని హీరో అమర్‌దీప్ అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ మాట్లాడారు. చైతన్యవర్మ, రమ్యప్రియ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వి.రవికుమార్, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: పికాక్ మూవీ మేకర్స్.

ఉపేంద్ర ఫాంటసీ

కన్నడ అగ్రనటుడు ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న ఫాంటసీ చిత్రం 'యూఐ'. జి.మనోహరన్, కె.పి.శ్రీకాంత్ నిర్మాతలు. డిసెంబర్ 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా రిలీజ్‌డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఉపేంద్ర పెద్ద గన్ పట్టుకుని డైనమిక్‌గా నిల్చున్న ఈ పోస్టర్ మాస్‌కి నచ్చేలా ఉంది. రీష్మా నానయ్య కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నిధి సుబ్బయ్య, మురళీశర్మ, పి.రవిశంకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: హెచ్‌సీ వేణుగోపాల్, సంగీతం: అజనీష్ బి.లోక్‌నాథ్.

మెకానిక్ రాకీ సందడి

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతోన్న మాస్ యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్ 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. సోమవారం ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నవంబర్ 22న సినిమాను విడుదల చేయనున్నట్టు ఈ పోస్టర్ ద్వారా మేకర్స్ తెలియజేశారు. ఈ పోస్టర్‌లో విశ్వక్‌సేన్ ఉద్వేగపూరితమైన ఎక్స్‌ప్రెషన్‌తో, మీనాక్షి చౌదరి సాంప్రదాయ చీరలో, శ్రద్ధా శ్రీనాథ్ మోడ్రన్ అవుట్ ఫిట్‌లో ఆకట్టుకున్నారు. ఈ నెల 20న ఈ సినిమా ట్రైలర్ విడుదల కానుంది. నరేశ్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘు రామ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కాటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: ఎస్ఆర్‌టీ ఎంటర్టైన్మెంట్స్.

పోస్ట్‌మ్యాన్ జీవితం

కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ ''క''. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ కలిసి దర్శకత్వం వహిస్తున్నారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. దీపావళి కానుకగా ఈ నెల 31న పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ ప్రెస్‌మీట్ జరిగింది. 'ఇది కంటెంట్ ఓరియెంటెడ్ ఫిల్మ్. 70వ దశకంలో జరిగే కథ. ఈ జనరేషన్‌తో పాటు పెద్దవాళ్లకు కూడా నచ్చే సినిమా ఇది. అభిరుచి గల ప్రేక్షకులకు తప్పక నచ్చుతుంది.' అని కిరణ్ అబ్బవరం చెప్పారు. 'అభినవ్ వాసుదేవ్ అనే ఓ పోస్ట్‌మేన్ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారం ఈ సినిమా కథ' అని దర్శకులు తెలిపారు. ఇంకా పంపిణీదారుడు వంశీ నందిపాటి, కథానాయిక తన్వీరామ్, సహ నిర్మాత చింతా రాజశేఖర్ రెడ్డి కూడా మాట్లాడారు.

ఉద్వేగంలోనూ నవ్వులు

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించిన కామెడీ థ్రిల్లర్ 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకుడు. పి.పద్మనాభరెడ్డి, అశోక్ రెడ్డి నిర్మాతలు. నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర దర్శకుడు మనోజ్ పల్లేటి, సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి విలేకరులతో ముచ్చటించారు. 'స్క్రిప్ట్ రెడీ అయ్యాక కొంతమంది నిర్మాతలను కలిశాను. వారికి స్క్రిప్ట్ నచ్చింది. కొత్త దర్శకుడు ఎలా తీస్తాడో అని డౌట్ పడ్డారు. విన్నవారంతా కథను మెచ్చుకోవడం నాలో ఆత్మవిశ్వాసం పెంచింది. పద్మనాభరెడ్డి, అశోక్‌రెడ్డి నాతో కలిశారు. ముగ్గురం కలిసి ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాం. ఇది థ్రిల్లింగ్ సందర్భాల్లో కూడా నవ్వించే కామెడీ థ్రిల్లర్. సంతోషంగా జీవితాన్ని సాగిస్తున్న ఓ అబ్బాయి జీవితంలోకి ఓ అమ్మాయి వచ్చి ఎలాంటి ఇబ్బందులు తీసుకొచ్చింది? అనేది ఈ మూవీ కాన్సెప్ట్' అని దర్శకుడు చెప్పారు. అన్ని ఎమోషన్స్ ఉన్న ఇలాంటి సినిమాకు మ్యూజిక్ చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉందని, టీమ్ అంతా కష్టపడి చేసిన సినిమా ఇదని సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి అన్నారు.

పొట్టేల్‌లో పటేల్‌గా

యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్ చేస్తున్న కాన్సెప్ట్ ఓరియెంటెడ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మాతలు. అజయ్ ఇందులో పటేల్‌గా పవర్‌ఫుల్ రోల్ పోషిస్తున్నారు. ఆయన లుక్‌ని పరిచయం చేస్తూ సోమవారం మేకర్స్ పోస్టర్‌ని విడుదల చేశారు. అజయ్ ఈ లుక్‌లో ప్రమాదకరమైన రెండు కుక్కల్ని చైన్స్‌తో పట్టుకొని, జాలీ దయా లేని కర్కోటకునిగా, రగ్గడ్‌గా కనిపిస్తున్నారు. ఈ నెల 25న 'పొట్టేల్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నట్టు మేకర్స్ తెలిపారు. ప్రియాంకశర్మ, తనస్వి చౌదరి, నోయల్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: నిసా ఎంటర్టైన్మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్.

భావోద్వేగ ప్రేమకథ

యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్ హీరోగా, విస్సా భీమశంకర్ దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, అనిల్ కుమార్ రవడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్న చిత్రం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర నిర్మాత దిల్‌రాజు క్లాప్ ఇవ్వగా, బాలీవుడ్ నిర్మాత నిహాలాని కెమెరా స్విచాన్ చేశారు. నటుడు శివాజీ గౌరవ దర్శకత్వం వహించారు. హీరో విశ్వక్‌సేన్ బౌండెడ్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. అతిథులంతా చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్వేగభరిత ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కుతున్నదని, షణ్ముఖ్ ఈ పాత్రకు సరిగ్గా సరిపోతాడు కాబట్టే తీసుకున్నామని, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు.

లే రాజా.. లే లే రాజా

మెగా హీరో వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా' పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కరుణకుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. అందులో భాగంగా 'లే లే రాజా..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. రెట్రో అనుభూతిని కలిగించేలా భాస్కరభట్ల రాసిన ఈ పాటను 70, 80ల కాలం నాటి తీరులో జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. నీతి మోహన్ ఆలపించారు. ఈ పాటలో వరుణ్‌తేజ్ భిన్నమైన గెటప్పులతో ఆకట్టుకోగా, కలర్‌ఫుల్ పబ్ నేపథ్యంలో సాగిన ఈ పాటలో నోరా ఫతేహి రెట్రో లుక్‌లో అలరించారు. జానీ మాస్టర్ నృత్య రీతులు ఈ పాటకు హైలైట్‌గా నిలిచాయి. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈచిత్రం నవంబర్ 14న గ్రాండ్‌గా విడుదల కానుంది. నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్.

భయపెట్టే ఘటికాచలం

నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న సస్పెన్స్ హారర్ థ్రిల్లర్ 'ఘటికాచలం'. అమర్ కామెపల్లి దర్శకుడు. ఎం.సి.రాజు నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. '19ఏళ్ల మెడికల్ స్టూడెంట్ జీవితంలో జరిగిన కథ ఇది. కథ అందించడంతోపాటు నిర్మాణ బాధ్యతను కూడా తీసుకున్న నా మిత్రుడు రాజుకి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. మారుతీగారు, ఎస్‌కేఎన్‌గారు ఈ సినిమా చూసి, నచ్చి మూవీని టేకప్ చేసి వారే విడుదల చేస్తున్నారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాం.' అని దర్శకుడు అమర్ కామెపల్లి అన్నారు. అన్ని విధాలుగా అందర్నీ ఆకట్టుకునే సినిమా ఇదని నిర్మాత ఎస్‌కేఎన్ చెప్పారు. ఇంకా పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని, హీరో నిఖిల్ దేవాదుల, రైటర్ డార్లింగ్ స్వామి, ఈటీవీ ప్రభాకర్, హీరోయిన్ అర్వికా గుప్తా తదితరులు మాట్లాడారు.

దో కమీనే యాక్షన్

దర్శకుడు వి.సముద్ర తనయులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్ హీరోలుగా పరిచయం అవుతున్న సినిమా 'దో కమీనే'. తస్మయి, శ్రీరాధ హీరోయిన్లు. వి.సముద్ర దర్శకుడు. చంద్ర పులుగుజ్జు నిర్మాత. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో సుమన్ క్లాప్ ఇవ్వగా, నందమూరి మోహన కృష్ణ కెమెరా స్విచాన్ చేశారు. బి.గోపాల్ ఫస్ట్‌షాట్‌కి దర్శకత్వం వహించారు. హీరో శ్రీకాంత్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. అతిథులంతా యూనిట్‌కి శుభాకాంక్షలందించారు. నవంబర్ 3 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని సముద్ర తెలిపారు. ఇంకా యూనిట్ మొత్తం మాట్లాడారు. సుమన్, బ్రహ్మానందం, అలీ, సునీల్, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీవెంకట్, సంగీతం: వినోద్, డైలాగ్స్: ఘటికాచలం.